
కేవీకే కో ఆర్డినేటర్‌గా సుచరితాదేవి



వైరా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్‌గా డాక్టర్ టి.సుచరితాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ విద్యాలయంలో గృహ విజ్ఞాన విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్న సుచరితాదేవి బదిలీపై వైరా కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చారు. గృహవిజ్ఞాన కేంద్రం పోషకాహార విభాగానికి అధిపతిగా ఉన్న ఆమె బదిలీపై వైరా కృషి విజ్ఞాన కేంద్రానికి వచ్చారు.

'స్థానిక' సమరానికి



'స్థానిక' సమరానికి ప్రధాన పార్టీలు సై అంటున్నాయి. సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో.. ఉమ్మడి జిల్లాలో రాజకీయ చదరంగం మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీలు ముందుగానే ఎన్నికల పోరు సై అన్నట్టుగా కాలు దువ్వుతున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకోవడం, గవర్నర్ ఆమోదానికి పంపడంతో బీసీ రిజర్వేషన్‌పై ఆర్డినెన్సు వెలువడే అవకాశం ఉంది. ఆ వెంటనే మండల, జిల్లా పరిషత్, సర్పంచ్ వార్డు, మునిసిపాలిటీలకు వరుసగా ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రక్రియను వేగంగా కొనసాగిస్తోంది.

- జిల్లాలో 'స్థానిక' పోరుకు రాజకీయ పార్టీలు సిద్ధం
- ముందే సన్నద్ధం అవుతున్న ప్రధాన పార్టీలు

ఖమ్మం, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు వేగిరం చేయడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా నిర్వహించారు. దీంతో గ్రామస్థాయిలో రైతుల్లో కొంత సానుకూల వాతావరణం నెలకొంది. దీనికితోడు అధికార కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయిలో 'ఇందిర మహిళా శక్తి సంబరాలు' పేరుతో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ, కొత్త రుణాల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లోనూ ఈ ప్రక్రియ నడుస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఈ సంబరాలకు హాజరవుతున్నారు. ఎంపీ రఘురాంరెడ్డి కూడా కొన్ని చోట్ల హాజరయ్యారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అధ్యక్షతన జరుగుతున్న ఈ సంబరాలను స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార వేదికలుగా సాగుతున్నాయి. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని, ముందుగానే విజ్ఞప్తి చేస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడకముందే అధికార కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు చేపట్టింది. ఇటీవల ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి వంశీచంద్‌రెడ్డితో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జీలు సమీక్షా సమావేశం నిర్వహించి స్థానిక ఎన్నికలతో కేడర్ సిద్ధం కావాలని కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. జిల్లాలో బీఆర్ఎస్‌కు స్థానిక ఎన్నికల్లో అవకాశం లేకుండా ఉండేందుకు కాంగ్రెస్ పకడ్బందీ కార్యాచరణ నిర్వహిస్తోంది. నోటిఫికేషన్ కోసం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కొండంత ఆశగా ఎదురు చూస్తున్నారు. జడ్పీటీసీలు, మండల పరిషత్, పంచాయతీ సర్పంచ్ వంటి కీలక పదవులు, మునిసిపల్ చైర్మన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఖమ్మం జిల్లాలో జడ్పీటీసీ స్థానాలు 20, ఎంపీపీలు 20, ఎంపీటీసీలు 283, సర్పంచ్‌లు 571, వార్డు స్థానాలు 5214 ఉన్నాయి. దీనికి తోడు మధిర సత్తుపల్లి, వైరా, ఏదులాపురం, కల్లూరు, మునిసిపాలిటీ చైర్మన్ పదవులు, కౌన్సిలర్ పదవులు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఖమ్మం కార్పొరేషన్‌కు ఇంకా గడువు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలుండవు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 478 పంచాయతీలు 4232 వార్డులుండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు ఇల్లెందు, అశ్వారావుపేట మునిసిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 జడ్పీటీసీలు, 22 ఎంపీపీలు, 233 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మేజర్ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆరాట పడుతోంది.

'స్థానిక' పోటీకి సిద్ధమవుతున్న బీఆర్ఎస్

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం చెందిన బీఆర్ఎస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి తన వైభవం చూపేందుకు ఆరాట

(మిగతా 6వ పేజీలో)

'మెప్మా'లో మేస్తున్నారు!

- మెప్మాలో జోరుగా అవినీతి
- ఖమ్మంలో మూడు బ్యాంకులను బురిడీ కొట్టించిన ఐదుగురు ఆర్పీలు
- నకిలీ సభ్యులతో రూ.2కోట్లు దండుకున్న ఆర్పీలు
- మూడేళ్లుగా కొత్త సంఘాల ఏర్పాటుపై తీవ్ర ప్రభావం
- ప్రతీ మహిళను సభ్యురాలిగా చేర్చాలని కోరుతున్న రాష్ట్ర ప్రభుత్వం



మహిళా సంఘాల సమావేశం

> పట్టణ మహిళా పేదరిక నిర్మూలనకు పాటు పడాల్సిన మెప్మా సిబ్బంది అవినీతికి అలవాటు పడ్డారు. అందిన కాడికి మేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ పలుకుబడి కూడా అనుకూలించడంతో వారి అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఖమ్మం నగరంలోని మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాల్లో కొంతమంది ఆర్పీలు తమ అవినీతి బయట పడకుండా బ్యాంకులను బురిడీ కొట్టిస్తూనే ఉన్నారు. అదీ ఏకంగా 2009వ సంవత్సరం నుంచి..

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. గత 16 ఏళ్లుగా మెప్మాలో మొదలైన అవినీతి తంతు కరోనా కష్టకాలంలోనూ పడగ విప్పింది. కొవిడ్ వైరస్ ప్రభావంతో బ్యాంకుల వద్దకు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు రాకుండానే బ్యాంకర్లు డబ్బులు పంపిణీ చేశారు. ఆ అవకాశాన్ని కొంతమంది ఆర్పీలు అవినీతికి అస్త్రాలుగా చేసుకున్నారు. ఈ సంఘటనతో ఖమ్మం నగరంలోని మహిళా సంఘాల్లో కొత్త సభ్యులు చేరకపోగా.. ఉన్న సభ్యులే దశలవారీగా సంఘాల నుంచి తీర్మానాలు చేయించుకొని మరీ బయటకు వెళ్తున్నారు.

మూడు బ్యాంకుల్లో రూ.2 కోట్లు బురిడీ

2020-2021 కరోనా సమయంలో ఖమ్మం నగరంలోని రోటరీనగర్, పాత బస్టాండ్ సెంటర్, వైరా రోడ్డులోని మూడు బ్యాంకులను కొంతమంది ఆర్పీలు ఆర్థిక దోపిడీని లక్ష్యంగా చేసుకున్నారు. ఖమ్మం నగరంలోని వీధుల వెంట బిక్షాటన చేసే వాళ్లు, సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వీధి వీధికి తిరిగి వ్యాపారాలు చేసుకునే వారు.. సమీప జిల్లాల మహిళల ఆధార్, ఇతర గుర్తింపు నెంబర్లను సేకరించారు. 2021లో కరోనా సమయంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మీ బ్యాంకు ఖాతాలకు రూ.10వేలు వేస్తారని నమ్మించి.. అమాయక మహిళలను బ్యాంకులకు పిలిపించారు. వారితో ముందుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని బ్యాంకులో 8 స్వయం సహాయక సంఘాల గ్రూపులుగా నమోదు చేయించారు. తర్వాత అదే సభ్యుల ఆధారాలతో రోటరీ నగర్ బ్యాంకులో 4 స్వయం సహాయక సంఘాలు గ్రూపులు, వైరా రోడ్డు బ్యాంకులో మరో 4 స్వయం సహాయక సంఘాల ఖాతాలు తీయించారు. మూడు బ్యాంకుల నుంచి సుమారు రూ.2 కోట్లు వరకు సంఘాల పేరుతో మంజూరు చేయించారు. ఆయా సంఘాల సభ్యులను బ్యాంకులకు పిలిపించి వారితోనే డబ్బులు డ్రా చేయించారు. తర్వాత మోదీ డబ్బులు అంటూ ప్రతీ సభ్యురాలికి రూ.10వేలు చేతిలో పెట్టి మిగిలిన డబ్బులను ఐదుగురు ఆర్పీలు తీసుకున్నారు. వారం రోజుల్లో మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు చెబుతామని నమ్మబలికి బ్యాంకుల నుంచి వెళ్లిపోయారు. రూ.10వేలు అందాయన్న సంతోషంలో ఉన్న మహిళలు.. తర్వాత తమ బ్యాంకు ఖాతాలతో రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు అప్పుల నమోదు జరిగినట్లు తెలుసుకోలేక పోయారు.

మూడేళ్లుగా అవినీతిపై మెప్మా ముసుగు

మూడు బ్యాంకులను ఆర్పీలు ఆర్థిక మోసం చేసిన సంఘటన 2022లో బయటపడింది. అప్పటి నుంచి బ్యాంకర్లు నకిలీ ఆధారాలతో రుణాలు పొందిన మహిళల గురించి తిరుగుతూనే ఉన్నారు. మెప్మా అధికారులతో ప్రతీ నెల సమావేశాలు పెట్టి డబ్బులు ఇప్పించాలని కోరుతూనే ఉన్నారు. అయితే అవినీతికి పాల్పడిన ఆర్పీల్లో రాజకీయ, (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

కమ్యూనిస్టులను లేకుండా చేయడం
ఎవరి తరం కాదు

- హామీలు నెరవేర్చకపోతే పోరుబాటే..
- సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులే
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

మధిర రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన పనిచేసే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరితరం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పేదల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నిత్యం అండగా ఉండేది, సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులేనని ఆయన పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రతిపక్షాలను అణగదొక్కే ప్రయత్నాలను బీజేపీ చేస్తుందని, విప్లవకారుల మృతదేహాలకు బీజేపీ భయపడుతుందని ఎద్దేవా చేశారు. శనివారం ఖమ్మం జిల్లా మధిరలో ప్రారంభమైన సీపీఐ 23వ మహాసభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మరణించిన తర్వాత కూడా విప్లవకారులు ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తారనే భయంతో బీజేపీ నేతలు జంకుతున్నారన్నారు. విప్లవకారులను లేకుండా చేయడం ఎవరి తరం కాదన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించేవారిని లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులను తుద ముట్టిస్తామని అమిత్‌షా లాంటి వారు ప్రగల్బాలు (మిగతా 6వ పేజీలో)



6

సీపీఐ జిల్లా మహాసభలు
ఘనంగా ప్రారంభం

పతాకాన్ని ఆవిష్కరించిన జాతీయ నేత పువ్వాడ



రేడియోలో ప్రసంగిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్

భద్రాద్రి జిల్లా
అభివృద్ధి పథంలో..

- రేడియో ప్రసారం ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడిన కలెక్టర్ జితేష్ వీ పాటిల్

కొత్తగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో జిల్లా దూసుకెళుతోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ శనివారం ఆలిండియా రేడియో కొత్తగూడెం కేంద్రం నిర్వహించిన 'అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం' అనే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ప్రజలకు లైవ్ ఫోన్ కాల్స్ ద్వారా కలెక్టర్‌తో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కల్పించడంతో.. వివిధ మండలాల ప్రజలు ఎన్నో ప్రశ్నలు, అభిప్రాయాలు, సూచనలు తెలియ జేశారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణ రహదారులు, తాగునీటి సమస్యలు, రేషన్‌కార్డుల జారీ, పెన్షన్ జాప్యం, వ్యవసాయ సవాళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. కలెక్టర్ ప్రతీ అంశాన్ని ఆసక్తిగా వినడంతో పాటు సమస్యలపై తక్షణమే స్పందించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి సంబంధించి సంబంధిత శాఖలకు వెంటనే సూచనలు చేసారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరి అభిప్రాయం ఎంతో విలువైందన్నారు. ప్రజల అభ్యర్థనలు, సమస్యలు.. పాలనకు మార్గదర్శకంగా పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం హెడ్ శంకరరావు, సిబ్బంది ప్రభాకర్, ఆనంద్, సుమన్, కోటేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాస్, మహిళా రేడియో జాకీలు పాల్గొన్నారు.

పొంగలిలో తెల్ల పురుగులు

- తినకుండా తరగతులకు వెళ్లిన విద్యార్థినులు
- భద్రాచలం గురుకుల బాలికల కళాశాలలో ఘటన
- పీవో ఆదేశాలతో విచారణ చేపట్టిన ఆర్‌సీవో



పురుగుల పొంగలిని చూపుతున్న విద్యార్థినులు

భద్రాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో శనివారం విద్యార్థులకు ఉదయం అందించిన పొంగలిలో తెల్ల పురుగులు వచ్చాయి. ప్రతీరోజు విద్యార్థులకు వసతి గృహంలో అల్పాహారాన్ని అందిస్తారు. ఈ క్రమంలో శుక్రవారం 550 మంది విద్యార్థినులకు 80కేజీల పొంగలి అన్నం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో పొంగలిని తినేందుకు వచ్చిన విద్యార్థినులకు అందులో తెల్ల పురుగులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విద్యార్థినులు పొంగలి తినకుండానే తరగతి గదులకు వెళ్లారు. ఈ విషయం తెలియక అంతకు ముందు పలువురు పొంగలిని అప్పటికే తిన్నట్టు తెలుస్తోంది. గత మూడు రోజులుగా ఇదే రీతిలో తెల్ల పురుగులు వస్తున్నాయని చెప్పినా.. ఎవరూ పట్టించుకోలేదని సమాచారం. శనివారం కూడా అదేవిధంగా పొంగలిలో తెల్ల పురుగులు వచ్చాయని విద్యార్థినులు సిబ్బందికి తెలపడంతో ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి దృష్టికి వచ్చింది. దీంతో పొంగలి అన్నంను పక్కన పెట్టించారు. అదే ప్రాంగణంలో ఉన్న పాఠశాల నుంచి బియ్యాన్ని తెప్పించి మళ్లీ విద్యార్థినులకు వంట చేసి పెట్టినట్టు తెలిపారు. అంతకు ముందు విద్యార్థినులకు బిస్కెట్లను అందజేసినట్లు తెలిపారు.

పీవో ఆదేశాలతో విచారణ చేపట్టిన ఆర్‌సీవో

పొంగలిలో పురుగులు వచ్చిన విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఘటనపై తక్షణమే స్పందించారు. గురుకులాల ఆర్‌సీవో అరుణకుమారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఘటన జరిగిన తీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో గురుకుల కళాశాలలో విద్యార్థినులు, సిబ్బందితో జరిగిన సంఘటనపై పూర్తి వివరాలు సేకరించి పీవోకు నివేదిక అందజేశారు. పురుగులు రావడం గమనించిన సిబ్బంది ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారని పీవోకు నివేదించారు. అదే విధంగా డీఎం సివిల్ సప్లయ్ నుంచి వచ్చిన 19 క్వింటాళ్లలో కొన్ని పాత స్టాక్ ఉండటం వల్ల పురుగులు వచ్చినట్టు గుర్తించి వాటిని జీసీసీకి పంపించి వాటి స్థానంలో మంచి బియ్యాన్ని తెప్పించామని తెలిపారు. ఇక ముందు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాల ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్, వంట సిబ్బందిని గురుకులాల ఆర్‌సీవో అరుణకుమారి ఆదేశించారు.

పిడుగుపాటుకు
యువ రైతు మృతి



రవి మృతదేహం

చంద్రుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనులో పాటు చేయటానికి వెళ్లిన రైతు బాణోత్ రవి(33) అనే రైతు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వెంకటాతండాలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. భార్య కవితతో కలిసి రవి గ్రామ సమీపంలోని తన పత్తిచేనులో పాటు చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వర్షం ప్రారంభం కావటంతో వారిద్దరూ సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. ఈ సమయంలో వర్షం ఎక్కువ కావడంతో.. మరో పెద్ద చెట్టు కిందకు వెళుతుండగా పిడుగుపాటుకు గురై రవి అక్కడికక్కడే మృతిచెందాడు. రవికి కొంత దూరంలో ఉన్న భార్య కవిత స్పృహ కోల్పోయింది. ఈ ప్రమాదాన్ని సమీప రైతులు గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. రవిని చంద్రుగొండ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే రవి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

వాడపల్లిలో సత్తుపల్లి విద్యార్థి గల్లంతు

- కారులో దైవ దర్శనానికి వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థులు
- గోదావరిలో స్నానానికి దిగిన యువకులు
- ఈత రాక దినేష్ గల్లంతు
- గాలింపు చర్యలు చేపట్టిన ఎస్డీఆర్ఎఫ్ బృందం

7



గల్లంతైన దినేష్ (ఫైల్)

గిరిజనుల దేవుళ్లపై ఐటీడీఏ పీవో అధ్యయనం

ఆళ్లపల్లి మండలంలోని గిరిజన దేవుళ్ల విశిష్టత తెలుసుకున్న రాహుల్

ఆళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన వంశీయుల ఇలవేల్పులు అయిన దేవుళ్ల చరిత్ర, విశిష్టతపై ఐటీడీఏ పీవో రాహుల్ అధ్యయనం చేస్తున్నారు. అందులో భాగంగానే శనివారం ఆయన ఆళ్లపల్లి మండలం, మర్కోడు గ్రామపంచాయతీ, పెద్దూరు గ్రామంలోని రెక్కలరామక్క ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గిరిజన వంశీయుల ఇలవేల్పు పగడలపై ఉన్న గిరిజన వంశీయుల వృద్ధి, దేవుళ్ల, వారి పరిపాలన జీవిత చరిత్ర, జాతర విశేషాలు, వ్యవసాయ విధానం, మాట్లాడే భాష, పలు విధాల విశిష్టతపై పూజారుల ద్వారా తెలుసుకున్నారు. ఆళ్లపల్లి మండల వ్యాప్తంగా ప్రధానంగా ఆరు విధాలుగా ఉన్న గొగ్గల, కొమరం, పాయం, సాగబోయిన, బొమ్మల, పడిగ ఇలా గిరిజన వంశీయుల ఇంటిపేరుతో ఉన్న వారి ఇలవేల్పు దేవుళ్ల చరిత్రను ఆయన పూజారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏటీడీవో రాధమ్మ, ఐటీడీఏ మ్యూజియం క్యూరేటర్ కొండు వీరస్వామి, రిటైర్డ్ హెచ్ఎం జగపతి, కొమరం రాంబాబు, చంద్రం, లక్ష్మయ్య, రామ్మూర్తి, ఆళ్లపల్లి మండలలో పలు గిరిజన వంశీయులు పాల్గొన్నారు.



రెక్కలరామక్క చరిత్రను తెలుసుకుంటున్న పీవో

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- కార్మికుల సమస్యలపై 31న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి
- టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ రామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మంచి భోజనాలు తయారు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆటో కార్మికులకు కనీసం రూ.12వేలు చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయటం లేదని ఆరోపించారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కారం కావటం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అధికారంలోకి వచ్చిన 18 నెలలకు కార్మికశాఖ మంత్రిని కేటాయించారని ఎద్దేవా చేశారు. కార్మికులకు వేతన చట్టాన్ని ప్రతి ఐదేళ్లకోసారి సవరించి పెరిగిన ధరల మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. పదేళ్లగా సవరణ చేయలేదని దుయ్యబట్టారు. అవుట్ సోర్సింగ్‌లో నియామకం జరిగిన కార్మికులు, ఉద్యోగులు ఆయా ఏజెన్సీల ద్వారా దోపిడీకి గురవుతున్నారని 50శాతం వేతనాలు కూడా ఏజెన్సీ నిర్వాహకులు ఇవ్వటం లేదని ఆరోపించారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న రాష్ట్ర వ్యాప్తంగా టీయూసీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపట్టామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కే శ్రీనివాస్, బొమ్మకంటి, బానోత్ రవి, రమేష్, కిన్నెర నారాయణ, శ్రీనివాస్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే
కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్
- వైరాలో అట్టహాసంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు
- ఐదు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళలు



జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

వైరా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వైరా నియోజకవర్గ స్థాయిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాది మంది మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సులు, ఆటోలు, సొంత వాహనాల్లో వైరాకు తరలివచ్చారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా అధికారులతో కలిసి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సంబరాలను ప్రారంభించారు. సంబరాల ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాన్ని ఆలపించారు. కోట్లాది రూపాయలకు చెందిన పొదుపు లింకేజీ, బీమా చెక్కులను ఎమ్మెల్యే మండలాల వారీగా మహిళలకు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను కూడా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేసేందుకు వడ్డీ లేని రుణాలను అందిస్తుందని తెలిపారు. మెప్మా, ఐకేపీల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తుందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు ఇతర అనేక ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. మహిళలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంబరాల అనంతరం వేలాదిగా తరలివచ్చిన మహిళలకు భోజన వసతి కల్పించారు. సంబరాల సమయంలో తీవ్ర ఎండ, ఉక్కపోతతో మహిళలు కొంత అసౌకర్యానికి గురయ్యారు. కొంతసేపు కరెంట్ సరఫరా నిలిచిపోవడం, భారీగా తరలివచ్చిన మహిళలకు మంచినీళ్లు వెంటనే అందకపోవడంతో కొంత ఇబ్బందిపడ్డారు. అయినప్పటికీ ఊహించిన దానికంటే మిన్నగా సంబరాలు విజయవంతం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సివిల్ సప్లయి డీఎం గంటా శ్రీలత, డీఆర్‌డీవో ఆర్.సన్యాసయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఐదు మండలాల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, చంద్రప్రకాష్, వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ జైపాల్, సొసైటీ అధ్యక్షులు సీహెచ్ రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్లకు బతుకమ్మలు అందజేస్తున్న మహిళలు

రామయ్య భూముల రక్షణకు ప్రభుత్వాలు చొరవ చూపాలి

వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి

భద్రాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రాములవారి భూముల రక్షణకు రెండు తెలుగు ప్రభుత్వాలు చొరవ చూపాలని విశ్వహిందూపరిషత్ విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పత్రిక ప్రకటన రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి పేరిట వెలువడింది. రాముడి పేరుపై ఉన్న భూముల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రస్తుతం రాములవారి గోశాల ప్రహరీగోడ నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని గోశాల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అందులో డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2018 నుంచి రామాలయానికి రావాల్సిన డ్యామేజీ చార్జీలు వెంటనే పురుషోత్తపట్నంలోని రామాలయ భూముల్లో ఉన్న వారు చెల్లించాలని పేర్కొన్నారు. పురుషోత్తపట్నంలోని భూములపై పూర్తి హక్కులు భద్రాద్రి దేవస్థానానికే చెందుతాయని వీహెచ్‌పీ స్పష్టం చేస్తోందన్నారు. రామాలయ ఈవోపై దాడి జరిగి రోజులు గడుస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదని వీహెచ్‌పీ స్పష్టం చేసింది. రామయ్య భూములు కాపాడేందుకు వీహెచ్‌పీ కార్యాచరణ చేస్తోందని పేర్కొన్నారు.



ఎరువుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు

జిల్లాలో యూరియా కొరతలేదు

- భద్రాద్రి జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు
- కొమరారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎరువుల కేంద్రం ప్రారంభం

ఇల్లెందురూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని సాగు చేస్తున్న ప్రతి రైతుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని భద్రాద్రి జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు తెలిపారు. శనివారం ఇల్లెందు మండలం కొమరారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జిల్లాలో యూరియా దొరకడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని సూచించారు. ఇప్పటికే జిల్లాకు 14500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చిందని తెలిపారు. జిల్లాలో ఉన్న 23 సొసైటీల ద్వారా ప్రతి రోజు 40 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తున్నమని వివరించారు. జిల్లాకు 37300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికే 14500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. కొంత మంది కావాలనే సోషల్ మీడియా ద్వారా యూరియా దొరకడంలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నరని రైతులు ఆ ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు.జిల్లాలో సాగు అవుతున్న ప్రతి పంటకు యూరియా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడకుండా యూరియా తమకు కేటాయించిన కేంద్రాల ద్వారా తీసుకెళ్లాని జిల్లా వ్యవసాయశాఖాదికారి బాబురావు తెలిపారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరావు, బండారి శ్రీనివాస్, కిన్నెర నర్సయ్య, రమేష్, చెన్నూరి కృష్ణ, శ్రీను, మాజీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ, ఏడీఏ లాల్‌చాంద్, ఏఓ సతీష్, సీఈఓ హిరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను రాళ్లతో కొట్టండి

వైరా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల పట్ల చులకనగా మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రజలు రాళ్లతో కొట్టాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలు బిర్యానికి అమ్ముడుపోయారని కేటీఆర్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ ఆయన పైవిధంగా అన్నారు. వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి నాయుడు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజలకు తాము అన్నం పెడితే కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన బిర్యానికి కక్కుర్తి పడ్డారని, ఖమ్మంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తెలంగాణ ప్రజలు బిర్యానికి అమ్ముడుపోయేవారు కాదని పేర్కొన్నారు. బిర్యాని, కమీషన్లకు అమ్ముడుపోయే సంస్కృతి కేటీఆర్ కుటుంబాదినేదనని విమర్శించారు. త్వరలో కేటీఆర్ జైలుకు వెళ్లే సమయం ఆసన్నమైందని.. అందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న నాయుడు సత్యనారాయణ

'మెప్మా'లో మేస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక బలం ఉండడంతో పాటు కొంతమంది కార్పొరేటర్లు (గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌లోకి మార్పు) అండగా నిలిచారు. దీంతో మెప్మా అధికారులు ఎటువంటి చర్యలకు సిఫార్సు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా అభిషేక్ అగస్త్య బాధ్యతలు తీసుకున్న తర్వాత విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. పూర్తి స్థాయిలో రిపోర్టు ఇవ్వాలని మెప్మా అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఓ ఆర్పీని విధుల నుంచి తొలగించారు. మరికొంత మందిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ వారిపై చర్యలకు సిఫార్సు చేసేందుకు మెప్మా అధికారులే వెనుకడుగు వేస్తున్నారంటే వారి రాజకీయ పలుకుబడే కారణంగా తెలుస్తోంది.

నూతన సంఘాల ఏర్పాటుపై తీవ్ర ప్రభావం

మూడు బ్యాంకులను ఐదుగురు ఆర్పీలు రూ.2కోట్లు బురిడీ కొట్టించిన సంఘటన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సంచలనంగా మారింది. గత నాలుగు సంవత్సరాలుగా ఖమ్మం నగరంలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులు దాదాపుగా అందరికీ తెలిసి పోయింది. దీంతో ఎన్నో ఏళ్లగా సంఘాల్లో ఆదర్శంగా ఉన్న సభ్యులు కూడా ఏదో ఒక రోజు మోసానికి గురవుతామని సంఘాల నుంచి తీర్మాణాలు రాయించి మరీ వెనుదిరిగి పోతున్నారు. ఫలితంగా కొత్త సంఘాలు ఏర్పాటు కావాలంటే కష్టంగా మారిపోయింది. దీంతో ఖమ్మం నగరంలో 2లక్షలకు పైగా మహిళలు ఉన్నా కూడా కేవలం 40వేల మంది మహిళలు మాత్రమే ఎస్‌హెచ్‌జీ సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కిశోర బాలికల నుంచి వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండరు.. ఇలా అన్ని వర్గాల వారిని సంఘాలుగా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టింది. కొద్ది మంది ఆర్పీల అవినీతితో మొత్తం ఖమ్మం మెప్మాకే మచ్చగా మారింది. ఇప్పటికైనా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య స్పందించి అవినీతి ఆర్పీల నుంచి డబ్బులు రికవరీ చేసి తిరిగి మెప్మాకు పూర్వ వైభవం, నమ్మకం తీసుకొస్తేనే ఖమ్మంలో మహిళా ఆర్థిక స్వావలంబనకు దారులు పడతాయి.

వంద సంఘాల ఏర్పాటుకు స్పెషల్ డ్రైవ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరిపే ఆర్థిక మహిళా సంక్షేమ పథకాలు అందాలంటే స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండాలి. ఖమ్మం నగరంలో ఇప్పటి వరకు 4,200 మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా 42 వేల మహిళలు సభ్యులుగా ఉన్నారు. 2 లక్షలకు పైగా మహిళలు ఉన్నారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న వంద రోజుల కార్యక్రమంలో ఖమ్మం నగరంలో వంద కొత్త సంఘాలను ఏర్పాటు చేసేందుకు మెప్మా పీడీ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలిచ్చారు. ఈ మేరకు మెప్మా ఆర్పీలతో ఖమ్మం నగరంలో ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టేందుకు సిద్ధంచేశారు. ఇంటింటి సర్వే జరిపి సంఘాల్లో లేని మహిళలకు అవగాహన కల్పించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. ఇలా మొత్తం 500 కొత్త సంఘాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వంద రోజుల కార్యక్రమం ముగిసే వరకు కనీసం 100 కొత్త సంఘాల ఏర్పాటుకు కార్యాచరణ చేశారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దకోరుకొండి గ్రామ సమీపాన గత మే నెలలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి వైద్య చికిత్స పొందుతూ శనివారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన కోమటి లాజరు(35) గత మే నెల 12 వ తేదిన చిన్నకోరుకొండి టు పెద్దకోరుకొండి రహదారి మధ్యన గల పెట్రోల్ బంక్ సమీపాన రాత్రి సమయంలో గేద అడ్డు తగిలి ప్రమాదినికి గురియైనాడు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించి లాజర్ మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటుగా పిల్లలు ఉన్నారు.

కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరి తరం కాదు

(5వ పేజీ తరువాయి)

పలుకుతున్నారన్నారు. ప్రజల పక్షాన ఉండే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరి వల్ల కాదన్నారు. ప్రపంచంలో సగం జనాభా కమ్యూనిస్టుల పాలనలోనే ఉన్నారన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే భారతదేశంలో కూడా కమ్యూనిస్టులకు గణనీయమైన స్థానాలు దక్కుతాయన్నారు. బూర్జువ పార్టీల అంతిమ లక్ష్యం అధికారమేనని, కమ్యూనిస్టులకు మాత్రం ప్రజాభ్యుదయం, సమాజ మార్పు, ఆర్థిక అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యమన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం అనేక చారిత్రక పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించిందన్నారు. ఈనేపథ్యంలో ఖమ్మంజిల్లా ఉద్యమ కేంద్రంగా బాసిల్లిందన్నారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహాసభలు నిర్వహించుకుంటున్నాయని, ఈ సభల్లో భవిష్యత్ కార్యక్రమాలపై విస్తృత చర్చ జరగాలన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా, సహాయ కార్యదర్శి బండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఆహ్వానసంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రామ్మోహన్‌రావు, బెజవాడ రవి, బాధ్యులు పూట్ల కొండల్‌రావు, మౌలానా, ఎంఏ. రహీం పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన
సీపీఐ జిల్లా మహాసభలు

- అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన జాతీయ నేత పువ్వాడ
- ఎరుపు మయమైన మధిర పురవీధులు

మధిర రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా సీపీఐ పార్టీ 23వ మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 20మండలాలతోపాటు ఖమ్మం పట్టణం, మధిర, వైరా, సత్తుపల్లి మునిసిపాలిటీలకు చెందిన 600మంది సీపీఐ ప్రతినిధులు ఈ సభలకు హాజరయ్యారు. రెండురోజులపాటు జరుగనున్న ఈ సభలకు తొలిరోజు పార్టీ ప్రతినిధులంతా ఎర్రచొక్కాలు, ఎర్రచీరలు ధరించి రావడంతో మహాసభ ప్రాంగణం ఎరువుమయంగా మారింది. ఉదయం 8గంటల నుంచే ప్రతినిధుల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మహాసభల ప్రారంభ సూచికంగా సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభల సందర్భంగా మధిరలోని రెడ్డి గార్డెన్స్‌ను సుందరంగా అలంకరించారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన కర్నాటి రామ్మోహన్‌రావు అధ్యక్ష ఉపన్యాసం చేశారు. కార్యదర్శి నివేదికను జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బండి సురేష్ ప్రవేశపెట్టారు. తొలిరోజు పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా, సహాయ కార్యదర్శి బండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఆహ్వానసంఘం అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రామ్మోహన్‌రావు, బెజవాడ రవి, బాధ్యులు పూట్ల కొండల్‌రావు, ఎం.ఏ.రహీం పాల్గొన్నారు.



సభా వేదికపై రాష్ట్ర, జాతీయ నేతలు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

'స్థానిక' సమరానికి సై

(5వ పేజీ తరువాయి)

పడుతుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. పోటీ చేసే వారికి పార్టీ ఎన్నికల మెటీరియల్‌తో పాటు అన్ని విధాల అండగా ఉంటామని కిందిస్థాయిలో పార్టీ నేతల గెలుపుకోసం రాష్ట్ర నాయకత్వం కూడా తోడుగా నిలుస్తుందంటూ భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ కూడా నియోజకవర్గ, మండలస్థాయి సమావేశాలకు నిర్వహించి స్థానిక ఎన్నికలకు సై అంటుంది. జిల్లాలో సీపీఐ కూడా స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మధిరలో జిల్లా మహాసభలు నిర్వహిస్తుంది. కాంగ్రెస్‌తో పొత్తులో ఉన్న సీపీఐ గౌరవప్రదమైన స్థానాలు తమకు కేటాయించాలని ఆ పార్టీ నేతలు ఇప్పటికే ప్రకటనలు జారీ చేస్తున్నారు. కాంగ్రెస్ అడిగిన సీట్లు ఇవ్వని పక్షంలో ఒంటరిగా పోటీ చేయాలా, లేక ఇతరపార్టీలతో కలిసి వెళ్లాలన్న దానిపై తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. మరో వామపక్షమైన సీపీఎం అధికార కాంగ్రెస్‌కు ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటుంది. తమకు లాభం చేకూరే పొత్తులతో పోటీచేసే ఆలోచనలో ఉంది. మండలాల్లో స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మద్దతు ఇవ్వడం, మద్దతు తీసుకోవడంతో పాటు అధికార కాంగ్రెస్‌లో ఉన్న వర్గ విభేదాలను అనుకూలంగా మలుచుకొని కాంగ్రెస్‌లో అసంతృప్తులతో జతకట్టే ఆలోచన సీపీఎం సాగిస్తుంది. బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్‌లో వర్గాలను అనుకూలంగా మలుచుకుని కొన్నిచోట్ల అవసరమైతే స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇచ్చే వ్యూహం చేస్తున్నట్టు నాయకుల మాటల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక బీజేపీ కూడా స్థానిక ఎన్నికల్లో పోటీకి సై అంటూ కార్యక్రమాలు సాగిస్తుంది. టీడీపీ ఎన్నికల్లో పోటీ విషయమై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఉమ్మడి జిల్లాలో పట్టున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ తనకు బలమున్న ప్రతీ చోట అభ్యర్థులను బరిలో నిలిపే ప్రయత్నంలో ఉంది. మొత్తమ్మీద ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఎన్నికల చదరంగం మొదలైంది.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

బోనకల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని డీపీవో ఆశాలత సూచించారు. మండలంలోని రాపల్లి గ్రామంలో శనివారం ఆమె ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన పరుచూరి సుజాతకు ఇళ్లు మంజూరు కాగా స్థల విషయంలో వివాదం నెలకొనడంతో గ్రామస్థులు సమస్యను డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. దింతో ఆమె స్థలాన్ని పరిశీలించారు. వివాదం ఉన్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టవద్దని, సొంత స్థలంలోనే నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో కొందరు పంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదు చేశారు. పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేటు పనులకు ఉపయోగిస్తున్నారని, అందుబాటులో ఉండటం లేదని చెప్పడంతో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంపీవో శాస్త్రీని ఆదేశించారు.



నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డపీవో ఆశాలత

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

- డీఎంవో రాంబాబు



సమావేశంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంవో రాంబాబు

బోనకల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామాల్లో కొనసాగుతున్న జ్వరాల సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఎమ్‌లు నెలలో 25 రక్త నమునాలను సేకరించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలకు కావాల్సిన కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, కొరత లేకుండా ఎప్పటికపుడు ఇండెంట్ పెట్టాలని కోరారు. గ్రామాలల్లో 0-40 ఏళ్ల ఎస్టీ జనాభా వారికి సికెల్ పరీక్షలు చేయాలన్నారు. వ్యాధి నిర్ధారణ తరువాత ప్రభుత్వం ద్వారా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, ఏఎంవో వెంకటరావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు పంచాయతీలను
తెలంగాణలో కలపాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ఏపీలో కలిసిన భద్రాచలం డివిజన్‌లోని ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో కలిపేందుకు కృషి చేయాలని కోరుతూ శనివారం తెలంగాణ కార్మిక గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన వినతిపత్రంను మంత్రికి అందజేయడంతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఈ విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించేలా లేఖ రాయాలని కోరారు. అలాగే భద్రాచలం రామాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ద్రాక్షారామంలో భద్రాద్రి రామయ్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక మాణిక్యాంబా సమేత భీమేశ్వర ఆలయ సమీపంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయం వద్ద రామయ్య కల్యాణాన్ని భద్రాచలం దేవస్థానం వైదిక సిబ్బంది సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, యోక్త్రధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంతో కల్యాణ ప్రక్రియ ముగిసింది. స్థానికుల ఆహ్వానం మేరకు భద్రాద్రి దేవస్థానం శ్రీరామ ప్రచార రథం అక్కడకు వెళ్లగా శుక్రవారం రాత్రి స్థానికులు రామయ్యను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా కల్యాణాన్ని సైతం అధిక సంఖ్యలో భక్తులు తిలకించి పులకించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు అమరవాది శ్రీకాంతాచార్యులు, వేద పండితులు నరసింహాచార్యులు వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ఐదురోజుల కార్యాచరణ పాటించాలి

» భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్ 2025లో భాగంగా గ్రామాల పరిశుభ్రతను పెంపొందించేందుకు ఐదురోజుల కార్యాచరణ పాటించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షన్‌పై అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛత పెంపొందించేందకు స్వచ్ఛ సర్వేక్షన్, సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద ప్రతి వారం ఐదురోజుల కార్యాచరణను పాటించాలని సూచించారు. రానున్న బుధవారం లోపు ప్రతీ గ్రామ పంచాయతీలో మ్యాజిక్ సోక్‌పిట్‌లు పూర్తిగా నిర్మించాలన్నారు.

ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారించండి

» ఎస్పీ రోహిత్‌రాజు



మొక్కను నాటుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

పాల్వంచ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారు ఎంతటి వారైనా వారిపట్ల కఠిన వైఖరి అవలంభించాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పాల్వంచ డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. పలు కీలక కేసుల వివరాలను, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటి మొక్కల ప్రాముఖ్యతను సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలని అన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ సతీష్, ఎస్ఐలు సుమన్, జీవన్‌రాజ్, కళ్యాణి, దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

» ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ రామనాథం



మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

జూలూరుపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): బనకచర్లపై, సాగునీటి విషయంలో సెంటిమెంట్‌ను లేవనెత్తి బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నాయని ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. శనివారం జూలూరుపాడులో జరిగిన టీడీపీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించినప్పటికీ ఆ పార్టీ నాయకులు టీడీపీకి సహకారం అందించడం లేదని ఆవేదన చెందారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అధికారంలో ఉన్నప్పుడు ఒకవిధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా సాగునీటి విషయంలో మాట్లాడటం తగదన్నారు. స్థానిక ఎన్నికల్లో తమతో కలిసివచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకూరి చలపతి, కాపా కృష్ణ మోహన్, ఆరెం రామయ్య, వడ్డే వెంకటనారాయణ, చల్లమల గోవింద్, కోటంరాజు, రోకటి నరసింహారావు, చావా వెంకటేశ్వర్లు, రామారావు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి

» విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య



మాట్లాడుతున్న నాగయ్య

ఇల్లెందుటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి) రాజ్యాంగంలోని హక్కుల అమలు కోసం పోరాడాలని ఆదివాసీ పోరు గొంతుకలుగా నిలవాలని విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య కోరారు. అరుణోదయ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇల్లెందులో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. శబ్దంతో ప్రజాహృదయాలను కదిలించే అరుణోదయ భారత రాజ్యాంగా హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక హక్కులు, ప్రదేశిక హక్కులు అమలు చేయకుండా పాలకులు నీరుగారుస్తున్నారని విమర్శించారు. అధికార పక్షాలు ప్రజల తరుపున ఆలోచించకుండా కొంతమంది పెట్టుబడిదారులకు కాపలాగ వ్యవహిరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఐలయ్య, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి రాజు, తుపాకుల నాగేశ్వరావు, వెంకన్న, చిరంజీవి, జ్యోతి, స్వప్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణధార ట్రస్ట్ సేవలు అమోఘం

» భద్రాద్రి జిల్లా డీఎఫ్‌వో కిష్టగౌడ్

చుంచుపల్లి, జూలై19(ఆంధ్రజ్యోతి): ప్రాణధార ట్రస్ట్ సేవలు అమోఘమని భద్రాద్రి జిల్లా డీఎఫ్‌వో కిష్టగౌడ్ కొనియాడారు. శనివారం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ జిమ్ సంతోష్, రెస్క్యూ సభ్యుడు ముజఫర్‌లను సమాజంలో అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా గుర్తించి అభినందించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ జనావాసాల్లోకి వచ్చిన పాములను ఎంతగానో శ్రమించి పట్టి ప్రజలను ఆదుకోవడమే కాకుండా వారికి పర్యావరణం గురించి, పాముల గురించి అవగాహన కల్పిస్తున్న సంతోష్, స్నేక్ రెస్క్యూ సభ్యులను నేటి యువతకు ఆదర్శం అన్నారు. వారికి త్వరలోనే స్నేక్ రిస్క్యూ పరికరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొత్తగూడెం ప్రాంతంలో పట్టిన పలు పాములను తీసుకెళ్లి వాటిని గురించి డీఎఫ్‌వోకు వివరించారు.



ప్రాణధార ట్రస్ట్ సభ్యులను అభినందిస్తున్న డీఎఫ్‌వో కిష్టగౌడ్

దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, జూలై19(ఆంధ్రజ్యోతి): పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ కులాలకు సంబంధించిన దివ్యాంగుల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జి షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అనసూర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ మెట్రిక్ కోర్సు చదువుతున్న విద్యార్థులు తమ వివరాలను ఈ - పాస్ వెబ్‌సైట్ నందు వేతనాలు మంజూరు కోసం నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 30న నిర్ణయించినట్లు తెలిపారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మందకృష్ణ పర్యటనను జయప్రదం చేయండి

భద్రాచలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఈ నెల 24న పెన్షన్ పెంపు కోసం పెన్షన్‌దారుల జిల్లా సదస్సులో పాల్గొనేందకు వస్తున్న మంద కృష్ణమాదిగ పర్యటనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని మహాజన మహిళ సమైఖ్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత కోరారు. శనివారం భద్రాచలంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పెన్షన్ దారుల పెన్షన్ పెంపు జిల్లా సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అలవాల రేవతి, గద్దల కృష్ణవేణి, బొమ్మనననేని మంగ, రావుల నిర్మలమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

డైరెక్టర్ (పా) గౌతమ్‌ను కలిసిన ఉద్యోగుల సంఘం నాయకులు



డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును కలిసిన నాయకులు

రుద్రంపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రును ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకుడు కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు. సెంట్రల్ కమిటీ సభ్యుడు బందేల విజయేందర్‌లు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు త్వరలోనే పీఆర్సీ

● పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య

జూలూరుపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు త్వరలేని పీఆర్సీని ఇప్పించే బాధ్యతను తమ సంఘం తీసుకుంటుందని పీఆర్‌టీయూ టిఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య తెలిపారు. శనివారం జూలూరుపాడులోని కేజీబీవిలో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బి.పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా సర్దార్ వల్లభ్‌పటేల్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సిహెచ్.యుగేందర్, అసోసియేటివ్ అధ్యక్షుడిగా దేవేందర్‌ను నియమించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి ప్రభాకర్‌రావు, నాయకులు భాస్కర్, సాల్మాన్‌రాజు, హరిలాల్, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
ఆటో డ్రైవర్ మృతి

కొత్తగూడెంపోస్టాఫీస్ సెంటర్,జూలై19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. జన్మదిన వేడుకలు నిర్వహించిన రోజు అర్ధరాత్రి 2:15 నిమిషాలకు జరిగిన ఈప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన భద్రాద్రి జిల్లాలో జరిగింది. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పరిధిలోని ప్యూన్‌బస్తీలో కొండేటి జాన్ సామ్యూల్(49) అలియాస్ సుమోజాన్ 30ఏళ్లుగా డ్రైవింగ్ వృత్తి చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం జన్మదిన సందర్భంగా ఇంట్లో వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆటోతో కిరాయికి వెళ్లాడు. అర్ధరాత్రి 2:15 నిమిషాలకు కొత్తగూడెం- లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల మధ్య ఉన్న ముర్రేడు వాగు బ్రిడ్జి ఎక్కుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొంది. సామ్యూల్ కిందపడిపోయాడు. రోడ్డుకు తలభాగం బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే దారిలో కొత్తగూడెం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఇదిగమనించి బస్టాండ్ సెంటర్‌లోని ఆటో స్టాండ్‌లో గల ఆటో డ్రైవర్‌లకు ఈ విషయం తెలియజేశాడు. ఆటో డ్రైవర్లు ముర్రేడు బ్రిడ్జి వద్దకు చేరుకొని మృతి చెందినది జాన్ సామ్యూల్‌గా గుర్తించారు.

బాలింత హఠాన్మరణం

పినపాక, జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బాలింత మహిళ దర్రాజు దుర్గ (28) గుండె సంబంధిత వ్యాధితో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు భర్త ప్రవీణ్, బంధువులు తెలిపారు. మూడు నెలల క్రితమే ఆమెకు మగబిడ్డ జన్మించాడు.కాగా శనివారం తెల్లవారుజామున మూత్రవిసర్జనకు వెళ్లివచ్చింది. నిద్రపోయింది. పక్కలో ఉన్న పిల్లాడు ఏడుస్తున్నా, ఆమె కదలక మెదలక ఉండడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు పరిశీలించగా, అప్పటికే మృతి చెంది ఉందన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

అశ్వాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై పెట్రోల్‌తో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన మొండికుంట గ్రామానికి చెందిన నగునూరి దుర్గాప్రసాద్ ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి మొండికుంట వైన్స్‌లో తోట వేణు కౌంటర్‌లో ఉండగా మద్యం మత్తులో ఉన్న దుర్గాప్రసాద్ వచ్చి అప్పు అడిగాడు. అప్పులేదని చెప్పటంతో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను వేణుపై చల్లి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వేణు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాడపల్లిలో సత్తుపల్లి విద్యార్థి గల్లంతు

» కారులో దైవ దర్శనానికి వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థులు

» గాలింపు చర్యలు చేపడుతున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం



ఆత్రేయపురం, జూలై19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా వేంసూరు మండలానికి చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని గోదావరిలో గల్లంతయ్యాడు. ఈఘటన శనివారం జరిగింది. వేంసూరు మండలం లచ్చన్నగూడేనికి చెందిన పామర్తి అశోక్ కుమారుడు దినేష్(23) స్థానిక ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇతర ప్రాంతాలకు చెందిన సహచర మిత్రులతో కలిసి ఆరుగురు సత్తుపల్లి నుంచి కారులో బయలుదేరారు. శనివారం ఉదయాన్నే కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లికి చేరుకున్న దినేష్‌తో పాటు మిత్రులు తెల్లవారుజామున నాలుగు గంటలకు గోదావరి నదికి వెళ్లారు. మిత్రులంతా కలిసి గోదావరిలో స్నానానికి దిగారు. అక్కడే ఉన్న పడవపై ఎక్కి గోదావరిలో కేరింతలు కొట్టారు. దినేష్‌కు ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మునిగి గల్లంతయ్యాడు. మిత్రులతో పాటు స్థానికులు గల్లంతైన దినేష్‌ను కాపాడే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని ఆలయ సమాచార కేంద్ర వద్దకు తెలియచేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వారందరూ సంఘటన స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, గజఈతగాళ్ల పోలీస్ సిబ్బంది గాలింపు చర్యలు చేపడుతున్నారు. కుటుంబ సభ్యులు మిత్రులు వాడపల్లి చేరుకున్నారు.

ఆన్‌లైన్ యాప్‌కు యువకుడి బలి



హరీష్(ఫైల్)

వేంసూరు/సత్తుపల్లిరూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్‌లో అప్పు తీసుకుని చెల్లించలేక ఓయువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన వేంసూరు మండలం దుద్దేపూడిలో చోటు చేసుకుంది. వేంసూరు ఎస్ఐ టీ.కవిత తెలిపిన వివరాల ప్రకారం దుద్దేపూడికి చెందిన ముత్యాల శ్రీను, సుజాత దంపతుల కుమారుడు హరీష్(22) అలియాస్‌హరీ సత్తుపల్లి మండలం తుంబూరులో అద్దెకు ఉంటూ హోటల్ నిర్వహిస్తున్నాడు. హరీష్ ఓఆన్‌లైన్ యాప్‌లో రూ.5 వేలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదు. ఈక్రమంలో యాప్‌కస్టమర్ కేర్ ప్రతినిధులు హరీష్‌కు ఫోన్ చేశారు. మీ బంధువుల అందరికీ అప్పులు చేసి చెల్లించడం లేదని చెబుతున్నామని, న్యూడ్ ఫొటోలను సామాజిక మాధ్యమాలలో షేర్ చేస్తామని బెదిరించారు. ఈ క్రమంలో ఈనెల 17న దుద్దేపూడిలోని ఓ పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారంరాత్రి మృతి చెందగా తుంబూరులో దహన సంస్కారాలు బంధువులు నిర్వహించారు. మృతుడి తల్లీదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కవిత కేసు నమోదు చేశారు.

రుణం మంజూరు పేరుతో సైబర్ మోసం

రైతు నుంచి నాలుగు విడతల్లో రూ.57,025 వసూలు

అశ్వారావుపేటరూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఏదో ఒకరూపంలో మోసాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా అశ్వారావుపేట మండలంలో ఓ వ్యక్తికి రూ.3లక్షల వరకు రుణం వస్తుందని తెలిపి దఫదఫాలుగా రూ.57,025 వసూలు చేశారు. ఆతరువాత సైబర్ నేరగాడి నుంచి సమాధానం లేకపోవటంతో మోసపోయినట్లుగా గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని మద్దికొండ గ్రామానికి చెందిన రైతు తాటి నాగరాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ వ్యక్తి ఫోన్‌చేసి మీకు రూ.3లక్షల వరకు రుణం రావటానికి అవకాశం ఉందని, రుణాన్ని మంజూరు చేయిస్తానని నమ్మ బలికాడు. అందుకు ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని ఈనెల 15న క్యూఆర్ కోడ్‌కు రూ.2200, రూ.8750 జమ చేయించుకున్నాడు. ఈనెల 17న మరలా ఫోన్ చేసి బ్యాంకు ఖాతాకు రూ.28,700, రూ.17,375లను వేయించుకున్నాడు. సదరు వ్యక్తి ఇంకా డబ్బులు కట్టాలని అడగగా అనుమానం వచ్చి ఆరా తీశాడు. సైబర్ నేరగాళ్లు మోసగించినట్లుగా గుర్తించారు. నాలుగు విడతల్లో మొత్తం రూ.57,025 రైతు వద్ద నుంచి కాజేశాడు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీస్‌స్టేషన్ నుంచి చైన్‌స్నాచర్ పరారీ?

కల్లూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పోలీస్ స్టేషన్‌లో విచారణ నిమిత్తం అదుపులో తీసుకొన్న ఓ చైన్ స్నాచర్ శుక్రవారంరాత్రి పరారైనట్లు సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పలుప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్ చోరీలకు పాల్పడిన ఓవ్యక్తిని విచారణ నిమిత్తం ఖమ్మం నుంచి కల్లూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సదరు చైన్‌స్నాచర్ పోలీసుల కళ్లుగప్పి పరారైనట్లు ప్రచారం జరుగుతుంది. చైన్‌స్నాచర్ కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. ఈసంఘటనపై 'ఆంధ్రజ్యోతి' విలేకరి స్థానిక ఎస్ఐ హరితను వివరణ కోరగా అలాంటిదేమీ జరగ లేదన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి బలవన్మరణం

పాల్వంచలో మతిస్థిమితం కోల్పోయి మహిళ, ఖమ్మంరూరల్ మండలంలో పురుగుమందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ,జూలై19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. టీచర్స్‌కాలనీకి చెందిన గోకినపల్లి విజయ స్థానికంగా ఇళ్లలో పాచిపని చేస్తూ జీవనం సాగిస్తుంది. భర్త రామకృష్ణ కుటుంబాన్ని వదిలి చాలా సంవత్సరాల క్రితం వెళ్లాడు. విజయ ఈ మధ్యకాలంలో తరచూ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను కొత్తగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంటాను అనిచెప్పి దగ్గర్లో ఉన్న చింతలచెరువుకు వెళ్లింది. కుటుంబ సభ్యులు వారించి ఇంటికి తీసుకువచ్చారు. శనివారం ఉదయం పని నిమిత్తం వెళ్లిన విజయ ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె కుమార్తె శ్రీలేఖ, కుమారుడు శ్రీకాంత్ వెతకసాగారు. ఈ క్రమంలో చింతలచెరువులో తల్లి మృతదేహాన్ని వారు గుర్తించారు. శ్రీలేఖ ఫిర్యాదు మేరకు పాల్వంచ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: పురుగుమందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గోళ్లపాడులోశనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోళ్లపాడు గ్రామానికి చెందిన గజ్జల ఆంజనేయులు(49) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంతకాలం క్రితం హైదరాబాద్‌లో బైపాస్ సర్జరీ చేయించారు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు.అయితే ఈనెల 18న కడుపునొప్పి రావటంతో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలం వద్ద మందు పిచికారి చేస్తుండగా

● ఒంటిపై పడిన క్రిమిసంహారక మందు

● వ్యక్తి పరిస్థితి విషమం

కరకగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరతోగు గ్రామానికి చెందిన సుతారి ప్రశాంత్ అనే వ్యక్తి తన పొలం వద్ద శనివారం మందు ట్యాంక్‌తో పురుగు మందు పిచికారి చేస్తుండగా మందు ఒంటిపై పడటంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గ్రామస్థులు వెంటనే 108 వాహనంలో కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మణుగూరు తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

పినపాక, 19 జూలై (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏడూళ్లబయ్యారం, పాతరెడ్డిపాలెం పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఏడూళ్ల బయ్యారం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కొందరు అక్రమార్కులు ఇందిరమ్మ ఇళ్ల పేరు చెప్పి, బీటీపీఎస్‌కు, ఇతర వాణిజ్య సంస్థలకు తోలకాలు జరుపుతున్నారన్న సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. కాగా అనుమతులు లేకుండా తోలకాలు జరుపుతున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని, పీఎస్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

తిరుమలాయపాలెం, జూలై19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టి పరిష్కరించామన్నారు. ప్రజలకోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సీపీఎం అభ్యర్థులను ప్రజలు ఆదరిస్తారన్నారు. ఈనెల 26న రైతుసంఘం మండల మహాసభ జరుగుతుందన్నారు. ఈసమావేశంలో పద్మనాభుల సుధాకర్, బింగి రమేష్, అంగిరేకుల నరసయ్య, నేర్సుల వెంకటేష్, మంగతాయి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిదశ నుంచే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ మోహన్‌బాబు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలని త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌వీఎంపాఠశాలలో విద్యార్థి సంఘం నాయకుల ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు, పాఠశాల డైరెక్టర్స్ కొండా.శ్రీధర్‌రావు, డాక్టర్ కిశోర్, ఉమా కిశోర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. విద్యార్థి ఎన్నికలు నిర్వహించటం వలన భారత రాజ్యాంగంలోని ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. అనంతరం ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఘనంగా బోనాల వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాస బోనాలు శనివారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రత్యేకంగా గ్రామదేవతను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు పోతురాజు, అమ్మవార్ల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆయా విద్యాలయాల్లో పండుగ విశిష్టతను వివరించారు. సంప్రదాయాలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని చెప్పారు.



విన్‌ఫీల్డ్‌లో పాఠశాలలో..



సర్వజ్ఞలో..



క్రియేటివ్‌లో..



త్రివేణిలో..



న్యూఇరాలో



స్మార్ట్‌కిడ్జ్‌లో..



శ్రీచైతన్యలో..

కానిస్టేబుల్ దాడి చేశాడని ఫిర్యాదు

ఖమ్మంక్రైమ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తనపై కానిస్టేబుల్ దాడి చేయటంతో పండ్లు విరిగాయంటూ రెడ్డిమళ్ల. శేషగిరి అనే వ్యక్తి ఖమ్మం టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం శివాయిగుడానికి చెందిన శేషగిరి జిల్లా న్యాయస్థానంలో బార్‌బాయ్(న్యాయవాదులకు సహాయకుడిగా) ఎంతో కాలం నుంచి పనిచేస్తున్నాడు. జూలై 12 ఖమ్మంలో సెకెండ్‌షో సినిమా చూసి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతున్నాడు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అతడిని ఆపడంతో తాను న్యాయస్థానంలో పనిచేస్తానని చెప్పడంతో వదిలేశారు. దీంతో ముందుకు వెళ్లాడు. పక్కనే ఉన్న కూల్ డ్రింక్ షాపు వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న ఒక కానిస్టేబుల్ అతడిపై లాఠీతో ముఖంపై దాడి చేయటంతో రెండు పళ్లు విరగడంతోపాటు పెదవి పగిలి రక్తం కారింది. దుస్తులు తడిచిపోయాయి. అలాగే ఇంటికి వెళ్లిన తాను చికిత్స పొందడంతో ఫిర్యాదు చేయటం ఆలస్యమైందని చెప్పాడు. తనపై దాడి చేసిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని శేషగిరి తన ఫిర్యాదులో పోలీసులను కోరాడు.

ఖమ్మం రూరల్‌లో ఓటర్ల విభజన పూర్తి

- సర్పంచ్ స్థానాలు 21, ఎంపీటీసీలు 14
- మొత్తం ఓటర్లు 35,693,
- మహిళ ఓటర్లు 18,601, పురుషులు 17,090



ఖమ్మంరూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు సంబంధించి ఖమ్మం రూరల్ మండల ఓటర్ల విభజన ప్రక్రియ పూర్తయింది. గతంలో మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉండగా అందులో ఏదులాపురం మునిసిపాలిటి కింద 10 పంచాయతీలను పూర్తిగా, పల్లెగూడెం, పోలేపల్లి గ్రామాలు సగభాగంతో కలిపి మునిసిపాలిటీలో విలీనం చేశారు. రఘునాథపాలెం మండలంలోని మూడు గ్రామపంచాయతీలు రూరల్‌లో విలీనం అయ్యాయి. దీంతో ప్రస్తుతం రూరల్ మండలంలో 21గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీ స్థానాలుగా అధికారులు ఖరారు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 35,693 మంది ఉన్నట్లు అధికారులు నిర్ధారణ చేశారు. అందులో మహిళలు 18,601, పురుషులు 17,090 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

14 ఎంపీటీసీ స్థానాలు

మండలంలో మొత్తం 14ఎంపీటీసీ స్థానాలు ఖరారు అయ్యాయి. అందులో కామంచికల్ ఓటర్లు 2,260మంది, పడమటి తండాలో 1960, పోలిశెట్టిగూడెంలో 2855, మంగళగూడెంలో 2420, గూడురుపాడు 2373, కాచిరాజుగూడెం2989, చింతపల్లి 3181, ఎమ్ వెంకటాయపాలెం పార్ట్ 1లో 3133, ఎమ్ వెంకటాయపాలెం పార్ట్ 2లో 1875, పోలేపల్లి 1610, గోళ్ళపాడు 1383, కొండాపురం 3526, పొన్నేకల్లు 1649,తల్లంపాడు 3540మంది ఓటర్లు ఉన్నారు. అందులో అత్యధికంగా తల్లంపాడు ఎంపీటీసీలో 3,540మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా పోలేపల్లిలో 1610 మంది ఓటర్లు ఉన్నారు.

21 గ్రామ పంచాయతీలు

మండలంలో మొత్తం 21 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో 18ఉండగా రఘునాథపాలెం మండలం నుంచి కామంచికల్, ధారేడు, పడమటి తండా గ్రామ పంచాయతీలను రూరల్‌లో విలీనంచేశారు.దీంతో రూరల్‌మండలంలో మొత్తం 21గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయి. వాటిలో తల్లంపాడు, పొన్నేకల్లు, ఆరెంపుల, కొండాపురం, ఆరెకోడు, ఆరెకోడుతండా, కస్నాతండా, తనగంపాడు, కాచిరాజుగూడెం, ఎమ్ వెంకటాయపాలెం,గూడురుపాడు, మంగళగూడెం,తీర్థాల,గోళ్లపాడు,పోలిశెట్టిగూడెం, పల్లెగూడెం, పోలేపల్లి, చింతపల్లి, కామంచికల్, ధారేడు, పడమటితండాలు మొత్తం21 గ్రామ పంచాయతీల్లో మొత్తం202వార్డులు ఉన్నాయి.

హోంగార్డు మృతి

ఖమ్మంక్రైమ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో హోంగార్డు రామకృష్ణ(51) మృతిచెందాడు. ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ ఇటీవల అనారోగ్య కారణాలతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో శనివారం మృతిచెందాడు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం వత్సవాయికి తరలించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు పుస్తెల తాడును ఓ గుర్తు తెలియని వ్యక్తి లాక్కెళ్లాడు. ఈ ఘటన ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్‌రోడ్ విజయనగర్ కాలనీలో శనివారం జరిగింది. దుర్గా అనే మహిళ తెల్లవారుజామున ఇంటిముందు ఊడుస్తుండగా గుర్తు తెలియని ఓవ్యక్తి 4 తులాల బంగారు పుస్తెల తాడు లాక్కుపోయాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



యోగితారాణా పర్యటనకు ఏర్పాట్లు చేయండి

డీఈవో సామినేని సత్యనారాయణ

నేలకొండపల్లి, జూలై19(ఆంధ్రజ్యోతి): వచ్చేవారం జిల్లా పర్యటనకు రానున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా పర్యటనకు ఏర్పాట్లు చేయాలని జిల్లావిద్యాధికారి సామినేని సత్యనారాయణ అన్నారు. శనివారం ఉన్నత పాఠశాలలో ఆరెగూడెం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలిన చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో డీఈఓ మాట్లాడారు. నేలకొండపల్లి సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ(ఏఐ)తరగతులను పరిశీలించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందుతున్న యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాల పంపిణీకి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. ఇటీవల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న దాన్ని విద్యార్థులకు బోధించాలన్నారు.తొలుత చెర్వుమాధారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు బోధనకు సంబంధించి తగుసూచనలు చేశారు.సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి.రమేష్, పి.కృష్ణారావు, రత్నకుమారి, ఉజ్వల, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐ ఇన్‌స్పైర్ సంస్థలో విజయ విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఇన్‌స్పైర్ ప్రవేటు లిమిటెడ్ బెంగుళూరు వారు శనివారం స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల యందు ఆన్‌క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో విజయ కళాశాలకు చెందిన వివిధ గ్రూపుల విద్యార్థులు 35 మంది ప్లేస్మెంట్ సాధించారు. ఈ విద్యార్థులంతా టీసీఎస్, ఎక్స్‌ఎల్‌ఆర్, ఇన్‌ఫోసిస్, తదితర సంస్థలలో ప్లేస్మెంట్ సాధించిన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కొణిజర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఓటకు చోటకు కేసులో ఇప్పటికి కోర్టుకు వెళ్లుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేజ్రీవాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని ఆప్ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు శనివారం ప్రకటనలో అన్నారు. పొత్తు ధర్మంలో ఉమ్మడికూటమిలో ఆప్ పార్టీ ఓట్లను వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్‌ను విమర్శించడం తగదన్నారు. ఈనెల 22న ఆప్ కార్యకర్తలు, నాయకులు హైదరాబాద్‌లో చేపడుతున్న కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

- సీఎం, జిల్లా మంత్రులపై అనుచిత వ్యాఖ్యలకు నరసనగా..

కల్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి) సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మలనాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కల్లూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కనీస మర్యాద లేకుండా విచక్షణ కోల్పోయిన కేటీఆర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిపై, జిల్లా మంత్రులపై పరుష పదజాలంతో మాట్లాడడం తగదని వారు అన్నారు. ఇకపై కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తే కాంగ్రెస్ కార్యకర్తలే తగిన గుణపాఠం చెప్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమలో ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు తకెళ్లపాటి ప్రసాద్, ఏనుగు సత్యంబాబు, ఎస్‌కే ఉస్మాన్, దార రంగా, బాగం ప్రభాకరచౌదరి, పెద్దబోయిన శ్రీను, తాళ్ల వెంకటేశ్వరరావు, ముకర విజయరావు పాల్గొన్నారు.

తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం, ఖమ్మం జిల్లా మంత్రులపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తల్లాడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తల్లాడ ప్రధాన రహదారుల్లో కేటీఆర్ దిష్టిబొమ్మను ఊరేగించిన అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపాసుధాకర్, మండల నాయకులు గోవిందు శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాసరావు, గణేశుల రవి, ఎర్రి కృష్ణారావు, చిత్తలూరి రమేష్, మాజీ జడ్పీటీసీ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నెంబరు 2లో ఓ గుర్తుతెలియని వృద్ధుడి (65) మృతిచెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. సరైన ఆహారం లేక అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావించారు. మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కే. శ్రీనివాసరావు తెలిపారు.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించి, ముత్యాల కవచాని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదాన సత్రంలో దాతల సహకారంతో సేవా సమితి నిర్వాహకులు అన్న గోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ. ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్ శాస్త్రి, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు



ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భయం భయంగా ప్రజా సేవలు

- శిథిలావస్థల్లో కల్లూరు డివిజన్ కార్యాలయాలు
- స్లాబ్ పై భాగం నుంచి నీటి ధారాలు
- పాలకులు స్పందించాలి

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలకు కాలం చెల్లింది. ఏళ్ల తరబడిగా ఆయా భవనాల్లోనే పలు శాఖల అధికారులు, వైద్యులు సేవలందిస్తుండగా, భవనం ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతోనే వైద్య సేవలు పొందుతున్నారు. మరో వైపు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ భవనాలు కూడ శిథిలావస్తకు చేరాయి. వర్షకాలం ప్రారంభమైతే ఆయా భవనాల్లో స్లాబు పైభాగం వర్షపు నీటికి చెమ్మ ఏర్పడి నీటి ధారాలు కారుతున్నాయి. దీంతో విద్యార్థులు కూడా ఆయా భవనాల్లో బిక్కుబిక్కు మంటు కాలం గడుపుతున్నారు.

రేకుల షెడ్డులో జలవనరుల శాఖ కార్యాలయులు..

కల్లూరులోని గత యాభై సంవత్సరాల క్రితం నాటి ఎన్నెస్పీ కాల్వల నిర్మాణ సమయంలో తాత్కాలికంగా నిర్మించిన రేకుల షెడ్డులలో ప్రస్తుతం జలవనరులశాఖ సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇవీ శిథిలావస్తకు చేరాడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో నీటి ధారలు పడి అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించడం కష్టాంగా మారింది. నీటి ధారలు పడడం వల్ల దస్త్రాలు, కంప్యూటర్ సిస్టమ్స్ దెబ్బతింటున్నాయి. ఆయా కార్యాలయాల్లో సుమారు 100 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తున్నందున వారు ఆందోళన చెందుతున్నారు.



రేకుల షెడ్డులో జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయం



శిథిల భవనంలోనే సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం

ప్రభుత్వ ఆసుపత్రి భవనం..

డివిజన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం కూడా 40 సంత్సరాల క్రితం నిర్మించేందే. ఈ భవనం లోపలి భాగం పూర్తిగా శిథిలావస్తకు చేరాడంతో స్లాబ్ పై భాగంలో పెచ్చులు ఊడి పడుతున్నాయి. వైద్యులు రోగులకు బిక్కు బిక్కు మంటూ సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లు ఉన్న పడక గదుల్లో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో రోగులు భయందోళన చెందుతున్నారు. ఇక్కడ వర్షాలు కురుస్తున్న సమయంలో స్లాబ్ పై బాగం పెచ్చులు ఊడి పడటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. ఇలాంటి సమయంలో వైద్యుల సేవలకు కూడా అంతరాయం కలుగుతుంది. ఈ కాలం చెల్లిన భవనానికి వైద్యశాఖ పరంగా ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

సాంఘీక సంక్షేమ వసతి గృహాలు..

మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ బాలుర వసతి గృహల భవనాలు కూడ శిథిలావస్తకు చేరాయి. కల్లూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం పూర్తిగా కాలం చెల్లింది. స్లాబ్‌పై భాగం పెచ్చులు ఊడిపడుతుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో స్లాబ్‌పై నుంచి నీటిధారలు పడడంతో విద్యార్థుల నివాసానికి ప్రమాదకరంగా మారింది. చిన్నకోరుకొండి బీసీ బాలుర వసతి గృహం పరిస్థితి కూడా ఇలాగే మారింది. కాలం చెల్లిన భవనాల్లో విద్యార్థులు ఉండలేని పరిస్థితి. ఆయా భవనాలకు తాత్కాలికంగా మరమ్మత్తులు చేసిన ఫలితం లేకుండా పోయింది.



పెచ్చులు ఊడుతున్న దృశ్యం

నూతన భవనాలు నిర్మించాలి

కల్లూరు డివిజన్ కేంద్రంలో పలు శాఖలకు సంబంధించిన కార్యాలయ భవనాలకు కాలం చెల్లడంతో ఉద్యోగులు విధులు నిర్వహించలేని పరిస్థితి. అలాగే వర్షాలు కురిసే సమయంలో మరిన్నీ ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు వాటిని తొలిగించి నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని, ఆ దిశగా ప్రభుత్వ పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కల్యాణ లక్ష్మిచెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) మండంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతులమీదగా శనివారం పలువురు లబ్దిదారుకుల కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కల్లూరు మునిసిపాలిటితో పాటుగా నారాణపురం, ఖాన్‌ఖాన్‌పేట, ముచ్చవరం, చెన్నూరు, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి తదితర గ్రామాల్లోని లబ్దిదారుల ఇంటింటా తిరిగి నేరుగా ఎమ్మెల్యే రాగమయి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణం జరుగుతున్న తీరును ఎమ్మెల్యే లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ సాంబశివుడు, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, తక్కెళ్లపాటి ప్రసాద్, ఏనుగు సత్యంబాబు, దామాల రాజు, ప్రభాకరచౌదరి, తల్లపరెడ్డి హనీమిరెడ్డి, కీసర మధుసూధన్‌రెడ్డి, ఆళ్లా నరిసింహారావు పాల్గొన్నారు.

భయం భయంగా ప్రజా సేవలు

- శిథిలావస్థలో కల్లూరు డివిజన్ కార్యాలయాలు
- స్లాబ్ పై భాగం నుంచి నీటి ధారలు
- పాలకులు స్పందించాలి


శిథిల భవనంలోనే సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలకు కాలం చెల్లింది. ఏళ్ల తరబడిగా ఆయా భవనాల్లోనే పలు శాఖల అధికారులు, వైద్యులు సేవలందిస్తుండగా, భవనం ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతోనే వైద్య సేవలు పొందుతున్నారు. మరో వైపు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ భవనాలు కూడ శిథిలావస్తకు చేరాయి. వర్షకాలం ప్రారంభమైతే ఆయా భవనాల్లో స్లాబు పైభాగం వర్షపు నీటికి చెమ్మ ఏర్పడి నీటి ధారాలు కారుతున్నాయి. దీంతో విద్యార్థులు కూడా ఆయా భవనాల్లో బిక్కు బిక్కు మంటు కాలం గడుపుతున్నారు.

రేకుల షెడ్డులో జలవనరుల శాఖ కార్యాలయాలు

కల్లూరులోని గత యాభై సంవత్సరాల క్రితం నాటి ఎన్నెస్పీ కాల్వల నిర్మాణ సమయంలో తాత్కాలికంగా నిర్మించిన రేకుల షెడ్డులలో ప్రస్తుతం జలవనరులశాఖ సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇవీ శిథిలావస్తకు చేరాడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో నీటి ధారలు పడి అధికారులు, ఉద్యోగలు విధులు నిర్వహించడం కష్టాంగా మారింది. నీటి ధారలు పడడం వల్ల దస్త్రాలు, కంప్యూటర్ సిస్టమ్స్ దెబ్బతింటున్నాయి. ఆయా కార్యాలయాల్లో సుమారు 100 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలా భయం భయంగా విధులు నిర్వర్తించాల్సి వస్తున్నందున వారు ఆందోళన చెందుతున్నారు.


రేకుల షెడ్డులో జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయం


పెచ్చులు ఊడుతున్న దృశ్యం

ప్రభుత్వ ఆసుపత్రి భవనం..

డివిజన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం కూడా 40 సంత్సరాల క్రితం నిర్మించేందే. ఈ భవనం లోపలి భాగం పూర్తిగా శిథిలావస్తకు చేరాడంతో స్లాబ్ పై భాగంలో పెచ్చులు ఊడి పడుతున్నాయి. వైద్యులు రోగులకు బిక్కు బిక్కు మంటూ సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లు ఉన్న పడక గదుల్లో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో రోగులు భయందోళన చెందుతున్నారు. ఇక్కడ వర్షాలు కురుస్తున్న సమయంలో స్లాబ్ పై బాగం పెచ్చులు ఊడి పడటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. ఇలాంటి సమయంలో వైద్యుల సేవలకు కూడా అంతరాయం కలుగుతుంది. ఈ కాలం చెల్లిన భవనానికి వైద్యశాఖ పరంగా ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు..

మండలంలోని పలు గ్రామాల్లో గల ప్రభుత్వ బాలుర వసతి గృహాల భవనాలు కూడ శిథిలావస్తకు చేరాయి. కల్లూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం పూర్తిగా కాలం చెల్లింది. స్లాబ్‌పై బాగం పెచ్చులు ఊడిపడుతుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో స్లాబ్‌పై నుంచి నీటిధారలు పడడంతో విద్యార్థుల నివాసానికి ప్రమాదకరంగా మారింది. చిన్నకోరుకొండి బీసీ బాలుర వసతి గృహం పరిస్థితి కూడా ఇలాగే మారింది. కాలం చెల్లిన భవనాల్లో విద్యార్థులు ఉండలేని పరిస్థితి. ఆయా భవనాలకు తాత్కాలికంగా మరమ్మత్తులు చేసిన ఫలితం లేకుండా పోయింది.

నూతన భవనాలు నిర్మించాలి

కల్లూరు డివిజన్ కేంద్రంలో పలు శాఖలకు సంబంధించిన కార్యాలయ భవనాలకు కాలం చెల్లడంతో ఉద్యోగులు విధులు నిర్వహించలేని పరిస్థితి. అలాగే వర్షాలు కురిసే సమయంలో మరిన్నీ ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రభుత్వ ఉన్నతాధికారులు వాటిని తొలిగించి నూతన భనవాల నిర్మాణం చేపట్టాలని, ఆ దిశగా ప్రభుత్వ పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

- సీఎం, జిల్లా మంత్రులపై అనుచిత వ్యాఖ్యలకు నరసనగా..


కల్లూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

కల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మలనాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా కల్లూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. కనీస మర్యాద లేకుండా విచక్షణ కోల్పోయిన కేటీఆర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రిపై, జిల్లా మంత్రులపై పరుష పదజాలంతో మాట్లాడడం తగదని వారు అన్నారు. ఇకపై కేటీఆర్ జిల్లా పర్యటనకు వస్తే కాంగ్రెస్ కార్యకర్తలే తగిన గుణపాఠం చెప్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమలో ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు తకెళ్లపాటి ప్రసాద్, ఏనుగు సత్యంబాబు, ఎస్‌కే ఉస్మాన్, దారరంగా, బాగం ప్రభాకరచౌదరి, పెద్దబోయిన శ్రీను, తాళ్ల వెంకటేశ్వరరావు, ముకర విజయరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, ఖమ్మం జిల్లా మంత్రులపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తల్లాడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తల్లాడ ప్రధాన రహదారుల్లో కేటీఆర్ దిష్టిబొమ్మను ఊరేగించిన అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపాసుధాకర్, మండల నాయకులు గోవిందు శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాసరావు, గణేశుల రవి, ఎర్రి కృష్ణారావు, చిత్తలూరి రమేష్, మాజీ జడ్పీటీసీ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఘనంగా బోనాలు


పోతురాజు వేషధారణలో చిన్నారులు

ఏన్కూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శనివారం బోనాల పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు పోతురాజు వేషదారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో పాఠశాల ప్రాంగణంలో పండగ శోభ సంతరించుకుంది. ఈవేడుకల్లో పాఠశాల డైరెక్టర్ పి.భూమేశ్వరరావు, కరస్పాండెంట్ వి. వెంకటసాయి,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులు

వైరా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు రైతులు శనివారం యూరియా కోసం ఆందోళన చేశారు. వైరా సొసైటీ పరిధిలోని తమ గ్రామానికి వచ్చిన యూరియాను తమకే పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సొసైటీ గోదాము వద్ద రైతులు ఆందోళనకు దిగారు. తమ గ్రామానికి వచ్చిన మూడు లారీల యూరియా ఏమైందని సొసైటీ సిబ్బందిని ప్రశ్నించారు. మూడు లారీల యూరియాను తమకే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. గోదాములకు మరమ్మతులు చేస్తున్న కారణంగా యూరియాను నిల్వ చేసే పరిస్థితులు లేక వైరా గోదాములో నిల్వ చేశామని, అక్కడ అవసరమైన రైతులకు యూరియా అందజేస్తామని, మరమ్మతుల అనంతరం ఇక్కడే యూరియా పంపిణీ చేస్తామని సిబ్బంది హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

22న స్పాట్ అడ్మిషన్లు


ప్రిన్సిపాల్ ఝాన్సీసౌజన్య

కారేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఇంటర్ కళాశాలలో 2025సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఖాళీ సీట్ల భర్తీకోసం ఈనెల22నస్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఝాన్సీసౌజన్య శనివారం తెలిపారు. బైపీసీ8, ఎంపీసీలో 8 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకశాన్ని పేద విద్యార్థులు సద్వీనియోగం చేసుకోవాలన్నారు. తమ ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరుకావాలన్నారు.

ఆత్మ విశ్వాసంతోనే ఆకాంక్షలు సాకారం

- వ్యక్తిత్వ వికాస నిపుణురాలు తేజావత్ ధనలక్ష్మి

ఎర్రుపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతోనే వ్యక్తిగత సామర్థ్యం పెరుగుతుందని, తద్వార ఉన్నత లక్ష్యాలను చేరుకుని ఆకాంక్షలు సాకారమవుతాయని ఇంపాక్ట్ ఫౌండేషన్ సంస్థ వ్యక్తిత్వ వికాస నిపుణురాలు తేజావత్ ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో గల ఎస్‌కేఎం జూనియర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వీయ అవగాహనతో మంచి లక్షణాలను అలవర్చుకుని అభివృద్ధి చేసుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంమెరుగుపడుతుందని తెలిపారు. సమాజంలో మెరుగైన వ్యక్తిగా ఎదగాలంటే సానుకూల దృక్పదంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థి దశలో పుస్తకాలు చదవడం, సదస్సులకు హాజరుకావడం, ప్రముఖ విషయాలపై ఆసక్తి పెంచుకోవడం లాంటివి చేయాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు తల్లిదండ్రులు, కుటుంబంపై చిన్న వయస్సు నుంచే బాధ్యత పెంచుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. గురువులు, స్నేహితులు, బంధువుల పట్ల సత్ప్రవర్తన కలిగా ఉండాలని తద్వారా వ్యక్తిత్వవికాసం పెరుగుతుందన్నారు. ఇది జీవితంలో నిరంతర ప్రక్రియ అని, దీని మెరుగుపరుచుకోవడం వల్ల సంతోషంగా ఉంటారని, తద్వారా విజయవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి సౌజన్యం, డైరెక్టర్లు దండెం సత్యనారాయణ రెడ్డి, మిర్యాల శ్యాంప్రసాద్, వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తాం

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి


ఫోన్ ద్వారా సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా సత్తుపల్లి మునిసిపాలిటీలోని 12వ వార్డులోని ద్వారకాపూరి కాలనీలో ఆమె పర్యటించారు. వీధివీధికి తిరుగుతూ ప్రతిఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకొస్తున్నామని, ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తున్నారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎమ్మెల్యేనే ప్రజల గృహాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని, అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమతో కలిసి అందరూ నడవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ కే.నరసింహా, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఎండీ.సలీమాఖాతూన్ గఫార్‌ఖాన్, ఎండీ.కమల్‌పాషా, దూదిపాల రాంబాబు, దామెర రమేష్, గుడ్లూరి రవి, వేల్పుల ప్రసాద్, నాగేంద్రచారి, రాజు, గాదె నాగు పాల్గొన్నారు.

కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు

సత్తుపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం ఆమె పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, శివా వేణులతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించి కూర్చోబెట్టినా ఇంకా బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అప్పట్లో కేసీఆర్ ఇచ్చిన హామీలు దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం విస్మరించారని దీని కారణంగా ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూడలేక దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రాస కోసం కేటీఆర్ ఇష్టారాజ్యంగా నీచ భాస మాట్లాడుతున్నారని రాష్ట్ర పరువు తీస్తున్నారని అన్నారు. కేసీఆర్ తెలంగాణా జాతి పిత కాదని బూతు పిత అన్నారు. కేటీఆర్ ఖమ్మంలో మాట్లాడుతూ మహిళలను కిట్టి పార్టీ అంటీలంటూ అవమానిస్తూ మాట్లాడారని అన్నారు. ఇంటిలో ఆడబిడ్డకు విలువ ఇవ్వని కేటీఆర్ బయట నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తామంటూ కేటీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని అన్నారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు, రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని అన్నారు.

‘కేజ్రీవాల్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు’

కొణిజర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఓటకు చోటకు కేసులో ఇప్పటికి కోర్టుకు వెళ్లతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేజ్రీవాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని ఆప్ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు శనివారం ప్రకటనలో అన్నారు. పొత్తు ధర్మంలో ఉమ్మడికూటమిలో ఆప్ పార్టీ ఓట్లను వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్‌ను విమర్శించడం తగదన్నారు. ఈనెల 22న ఆప్ కార్యకర్తలు, నాయకులు హైదరాబాద్‌లో చేపడుతున్న కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

చింతకాని, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీకు మించి యూరియాను విక్రయిస్తే విక్రయందారుల లైసెన్సులను రద్దు చేస్తామని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని నేరడ, నాగులవంచ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలు, సొసైటీ గోదాములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, రికార్డులను పరిశీలించారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. మోతాదుకు మించి యూరియా వాడరాదని, నానో యూరియా వాడకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు కళ్యాణి, రాము పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

సత్తుపల్లిరూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలోని వ్యభిచార గృహంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఎస్ఐ వీరప్రసాద్ ప్యాట్రోలింగ్ చేస్తుండగా వ్యభిచారం నడుస్తున్నదని నమ్మదగిన సమాచారంతో తనిఖీ చేయగా ఒక మహిళతో పాటు విటుడు పి.కాంతారావు పట్టుబడ్డారు. సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి ఇంటి యజమానితో పాటు సదరు మహిళ, విటుడుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చింతకాని, జూలై19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొమ్మెర రామమూర్తి శనివారం మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శెట్టి మోహన్‌రావు సతీమణి అన్నపూర్ణమ్మ ఇటీవల మృతిచెందడంతో మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండ్లపల్లి శేషు, పిన్నెల్లి శ్రీనివాస్, సకినాల అంజయ్య, కొలిపాక వీరబాబు, చిర్రబోయిన నరేష్ పాల్గొన్నారు.



ఆశయ సాధనలో అత్యుత్సాహం పనికిరాదు

- జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తల్లీదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి ఆశయాన్ని నిర్లక్ష్యం చేయకుండా చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలకు చేరాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం పట్టణంలోని గుడిపాడు రోడ్డులోని శ్రీ నారాయణ జూనియర్ కళాశాలలో సత్తుపల్లి మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా ఫంక్షనింగ్ ఆఫ్ కోర్ట్ ద్వారా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అన్యాయాలు, అక్రమాలు, అరాచకాల నుంచి కాపాడుకునేందుకు భారత రాజ్యాంగం అనేక హక్కులు, రక్షణ కల్పించిందని, ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, 14-18ఏళ్ల పిల్లలు మాకు అన్నీ తెలుసు అనే భావనలో ఉంటారని, ఇది సరికాదన్నారు. తల్లీదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే నిజాలు గ్రహించాలని, మంచి ప్రవర్తన కలిగిన విద్యార్థులు జీవిత లక్ష్యాలు సాధించగలరన్నారు. చైర్మన్ రామకృష్ణమాచార్యులు, ప్రిన్సిపాల్ నవకుమార్, అధ్యాపకులు శ్రీనివాసరావు, సుధీర్, ఆంజనేయులు, రాంబాబు, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు


ఆలయ ధ్వజస్థంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీవారికి శనివారం సర్వాంగాబిషేకం నిర్వహించి, ముత్యాల కవచాని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాబిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీ వెంకటేశ్వరస్వామి అన్నదాన సత్రంలో దాతల సహకారంతో సేవా సమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ. ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్ శాస్త్రి, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

ఏఐ ఇన్‌స్పైర్ సంస్థలో విజయ విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏఐ ఇన్‌స్పైర్ ప్రవేటు లిమిటెడ్ బెంగుళూరు వారు శనివారం స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల యందు ఆన్‌క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో విజయ కళాశాలకు చెందిన వివిధ గ్రూపుల విద్యార్థులు 35 మంది ప్లేస్మెంట్ సాధించారు. ఈ విద్యార్థులంతా టీసీఎస్, ఎక్స్‌ఎల్ఆర్, ఇన్ఫోసిస్, తదితర సంస్థలలో ప్లేస్మెంట్ సాధించిన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్ సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ అయేషాతరుణం, కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మీ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

న్యూలిటిల్‌ఫ్లవర్, వాణీ విద్యాలయాల్లో బోనాల వేడుకలు

వైరా, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్, వాణీ వివేకానంద విద్యాలయాల్లో శనివారం బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ రెండు పాఠశాలల్లోని చిన్నారులు, ఉపాధ్యాయులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు అలాగే వాణీ వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ చుండూరి వాణీ పాల్గొన్నారు.


వాణీ వివేకానందంలో బోనమెత్తిన ఉపాధ్యాయులు, చిన్నారులు

న్యూలిటిల్‌ఫ్లవర్‌లో బోనాల వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, ఉపాధ్యాయులు